సాక్షి
నిజామాబాద్


గురువారం । 6 । మార్చి । 2025



స్త్రీనిధి వసూళ్లకు..

స్త్రీనిధి రుణాల బకాయిల వసూళ్ల కోసం అధికార యంత్రాంగం ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపింది.

- 8లో ▸



గరిష్టం/కనిష్టం
39.2 /16.6

వాతావరణం

ఉదయం ఈదురు గాలులు వీస్తాయి. పగటి ఉష్ణోగ్రతలు పెరగవచ్చు. మధ్యాహ్నం ఉక్కపోతగా ఉంటుంది. రాత్రి చలి తీవ్రత తక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ఎల్లారెడ్డిపల్లె వాసికి ఆంత్రిక్ సురక్ష సేవా పతక్



ఇందల్వాయి: భారత సైన్యంలో విధులు నిర్వర్తిస్తున్న ఇందల్వాయి మండలంలోని ఎల్లారెడ్డిపల్లెకు చెందిన జవాన్ జీఎం నగేశ్‌కు కేంద్రం హోంశాఖ ఆంత్రిక్ సురక్ష సేవా పతక్‌ను అందజేసింది. సశస్త్ర సీమాబల్‌లో జవాన్‌గా కొనసాగుతున్న నగేశ్ నేపాల్ సరిహద్దుల్లో విధులు నిర్వర్తిస్తున్నారు. తన సేవలను గుర్తించి గత సోమవారం కేంద్ర హోంశాఖ ఆంత్రిక్ సురక్ష సేవా పతక్‌ను అందజేసిందని, పతకం అందుకోవడం తనకు గర్వంగా ఉందని నగేశ్ అన్నారు.

గంజాయి, అల్ప్రాజోలం దహనం



జక్రాన్‌పల్లి: వివిధ కేసుల్లో పట్టుబడిన గంజాయి, అల్ప్రాజోలంను మండలంలోని పడకల్ గ్రామంలో ఉన్న శ్రీ మెడికేర్ సర్వీసెస్‌లో బుధవారం దహనం చేశారు. 23 కేసుల్లో పట్టుబడిన 616 కిలోల 837 గ్రాముల గంజాయి, 3 కిలోల 444 గ్రాముల అల్ప్రాజోలాన్ని ఇన్‌చార్జి పోలీస్ కమిషనర్ సింధు శర్మ, డ్రగ్స్ డిస్పోజల్ కమిటీ ఆధ్వర్యంలో దహనం చేశారు. కమిటీ సభ్యులు అడిషనల్ డీసీపీ బస్వారెడ్డి, నిజామాబాద్ ఏసీపీ రాజా వెంకట్‌రామ్‌రెడ్డి, సీసీఆర్‌బీ ఏసీపీ రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజలను అప్రమత్తం చేయాలి

నిజామాబాద్ అర్బన్: ఎండల తీవ్రత నేపథ్యంలో వడదెబ్బ బారిన పడకుండా ప్రజలను అప్రమత్తం చేయాలని అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్ అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లో బుధవారం జిల్లా టాస్క్‌ఫోర్స్ కమిటీ సమావేశాన్ని నిర్వహించి ఎండల తీవ్రత, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చేపట్టాల్సిన చర్యలపై పలు సూచనలు చేశారు. ఈసారి వేసవి సీజన్‌లో సాధారణం కన్నా ఎక్కువగా ఉష్ణోగ్రతలు ఉండే అవకాశం ఉందన్న హెచ్చరిక నేపథ్యంలో ముందస్తుగా ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. లేబర్ అడ్డాలు, పని ప్రదేశాలను గుర్తించి తాగునీరు అందుబాటులో ఉంచాలని, ఆస్పత్రుల్లో ఓఆర్ఎస్ ప్యాకెట్లను నిల్వ ఉంచాలని వైద్యారోగ్యశాఖ అధికారులను ఆదేశించారు. ఆరోగ్య సిబ్బంది ఎప్పటికప్పుడు ప్రజలకు అవసరమైన సలహాలు, సూచనలు ఇవ్వాలని, కరపత్రాల ద్వారా వడదెబ్బ నివారణపై అవగాహన కల్పించాలన్నారు. ఉపాధి కూలీలకు నీడ సౌకర్యం కల్పించాలన్నారు. ఆయాశాఖల అధికారులు పాల్గొన్నారు.

అలీసాగర్ ఫిల్టర్ బెడ్ పరిశీలన



నిజామాబాద్ సిటీ: మున్సిపల్ కార్పొరేషన్‌కు తాగునీటిని అందించే అలీసాగర్ వాటర్ ఫిల్టర్‌బెడ్‌ను మున్సిపల్ కమిషనర్ దిలీప్‌కుమార్ ఇంజినీరింగ్ అధికారులతో కలిసి బుధవారం పరిశీలించారు. వేసవి కాలం ప్రారంభమైనందున నగరంలో తాగునీటికి ఇబ్బందులు తలెత్తకుండా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. కమిషనర్ వెంట అధికారులు, సిబ్బంది ఉన్నారు.

ఇంటర్ పరీక్షలు ప్రారంభం

కాకతీయ సెంటర్ వద్ద క్యూ కట్టి లోనికి వెళ్తున్న విద్యార్థులు



మొదటి రోజు 753 మంది గైర్హాజరు

- 50 సెంటర్లను తనిఖీ చేసిన అధికారులు

ఎస్ఎస్ఆర్ కళాశాల సెంటర్ వద్ద క్యూ కట్టిన విద్యార్థినులు





కాకతీయ సెంటర్ వద్ద హాల్‌టికెట్ నంబర్ చూసుకుంటున్న విద్యార్థులు

ఇంటర్మీడియట్ పరీక్షలు బుధవారం ప్రశాంత వాతావరణంలో ప్రారంభమయ్యాయి. మొదటి రోజున ఇంటర్ ఫస్టియర్ విద్యార్థులు తెలుగు, హిందీ, సంస్కృతం, ఉర్దూ భాషా పరీక్షలు రాసినట్లు జిల్లా ఇంటర్ విద్యాధికారి తిరుమలపుడి రవికుమార్ తెలిపారు. మొత్తం 19,191 మంది విద్యార్థులకు గాను 18,438 మంది హాజరుకాగా, 753 మంది గైర్హాజరయ్యారన్నారు. 57 పరీక్ష కేంద్రాలకు గాను 50 కేంద్రాలను తనతోపాటు జిల్లా పరీక్షల నిర్వహణ కమిటీ సభ్యులు, ఫ్లయింగ్, సిట్టింగ్ స్క్వాడ్‌లు, హై పవర్ కమిటీ, బల్క్ అధికారి, కస్టోడియన్లు తనిఖీ చేశారన్నారు. – నిజామాబాద్ అర్బన్

బందోబస్తు మధ్య ఆన్సర్ షీట్లను తరలించాలి

పరీక్ష పూర్తయిన వెంటనే ఆన్సర్ షీట్లను పోలీసు బందోబస్తు మధ్య నిర్దేశిత కేంద్రాలకు తరలించాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు అధికారులను ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని నిర్మల హృదయ జూనియర్ కళాశాల ఇంటర్ పరీక్ష సెంటర్‌ను ఆయన తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరు వివరాలు తెలుసుకుని సెంటర్‌లో వసతులను పరిశీలించారు. కాపీయింగ్ కు అవకాశం లేకుండా పూర్తి పారదర్శకంగా, పక్కాగా పరీక్షలు నిర్వహించాలన్నారు. కలెక్టర్ వెంట పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ సురయ్య తదితరులున్నారు.



నిర్మల హృదయ కళాశాల సెంటర్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

బీజేపీలో జోష్



నిజామాబాద్ నగరంలో సంబరాలు జరుపుకుంటున్న బీజేపీ శ్రేణులు

- పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీల గెలుపుతో శ్రేణుల్లో ఉత్సాహం
- సంబరాలు జరుపుకున్న నాయకులు, కార్యకర్తలు
- స్థానిక ఎన్నికల్లోనూ విజయం సాధిస్తాం: ఎంపీ ధర్మపురి అర్వింద్

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: భారతీయ జనతా పార్టీ నాయకులు, కార్యకర్తల్లో సరికొత్త జోష్ నెలకొంది. నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్, మెదక్ పట్టభద్రుల, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులు చిన్నమైల్ అంజిరెడ్డి, మల్క కొమురయ్య గెలుపొందడంతో ఆ పార్టీ శ్రేణులు ఉత్సాహంతో జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో సంబరాలు చేసుకున్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి మల్క కొమురయ్య మొదటి ప్రాధాన్యత ఓటుతోనే గెలుపొందారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డి మాత్రం రెండో ప్రాధాన్యత ఓటుతో విజయం సాధించారు. వరుసగా మూడురోజుల పాటు ఉత్కంఠభరితంగా సాగిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపులో ఆది నుంచీ అంజిరెడ్డి ఆధిక్యత కనబరుస్తూ వచ్చారు. త్రిముఖ పోరులోనూ అంజిరెడ్డి ఆధిక్యం ఏ రౌండ్‌లోనూ తగ్గలేదు. అయితే ప్రతి రౌండ్‌లోనూ ఆధిక్యత మాత్రం స్వల్పంగానే వచ్చింది. గెలుపునకు అవసరమైన నిర్ధారిత 50 శాతం ఓట్లు రాకపోవడంతో ఎలిమినేషన్ రౌండ్ల ప్రక్రియ తప్పలేదు. రెండో ప్రాధాన్యత ఓట్ల లెక్కింపులోనూ నిర్ధారిత 50 శాతం ఓట్లు ఎవరికీ రాలేదు. 54 మంది అభ్యర్థులు ఎలిమినేట్ అయ్యాక మిగిలిన రెండో ప్రాధాన్యత ఓట్లు లెక్కించాక బీజేపీ అభ్యర్థి అంజిరెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్‌రెడ్డి లలో ఎవరికీ నిర్ధారిత ఓట్లు రాకపోవడంతో ఆధిక్యంలో ఉన్న అంజిరెడ్డి గెలుపొందినట్లుగా రిటర్నింగ్ అధికారి ప్రకటించారు. రెండు స్థానాల్లోనూ విజయం లభించడంతో బీజేపీ శ్రేణులు సంబరాల్లో మునిగాయి.

■ నిజామాబాద్ జిల్లాలో లోక్‌సభ ఎంపీతో పాటు నిజామాబాద్ అర్బన్, ఆర్మూర్ శాసనసభ స్థానాల్లో గత ఎన్నికల్లో బీజేపీ గెలుపొందింది. తాజాగా పట్టభద్రుల, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ స్థానాలనూ బీజేపీ కైవసం చేసుకుంది. ఇదే ఊపులో నిజామాబాద్ జిల్లా ప్రజాపరిషత్, మండల ప్రజాపరిషత్‌లు, అత్యధిక పంచాయతీలు, మున్సిపాలిటీలు, నిజామాబాద్ నగరపాలక సంస్థలోనూ పాగా వేస్తామని బీజేపీ నాయకులు, కార్యకర్తలు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

పట్టభద్రులు, ఉపాధ్యాయుల నుంచి మహిళలు, యువత, ఇతర సాధారణ ఓటర్ల వరకు తమకు తిరుగులేని ఆదరణ ఇస్తున్నట్లు తాజాగా మరోసారి నిరూపితమైందని బీజేపీ శ్రేణులు చెబుతున్నారు. దీంతో స్థానిక ఎన్నికల్లోనూ పాగా వేస్తామంటున్నారు. గత ఎన్నికల్లోనూ నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో 60 డివిజన్లకు గాను 28 డివిజన్లను బీజేపీ కైవసం చేసుకుని అతిపెద్ద పార్టీగా నిలిచింది. ఈసారి సంపూర్ణ మెజారిటీతో నిజామాబాద్ నగరపాలకంలో పాగా వేస్తామని ఆ పార్టీ నాయకులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

పటాకులు కాల్చి.. మిఠాయిలు పంచి..

సుభాష్‌నగర్: ఉమ్మడి నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్, మెదక్ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీగా అంజిరెడ్డి విజయం సాధించడంతో బుధవారం రాత్రి బీజేపీ నాయకులు సంబరాలు నిర్వహించారు. పటాకులు కాల్చి నృత్యాలు చేశారు. మిఠాయిలు పంచిపెట్టారు.

బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేశ్ మాట్లాడుతూ తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వంపై అన్ని వర్గాల్లో వ్యతిరేకత ఉందని ఎమ్మెల్సీ ఫలితంతో తేలిపోయిందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు న్యాలం రాజు, నాగోళ్ల లక్ష్మీనారాయణ, స్వామియాదవ్, హరీశ్ రెడ్డి, మెట్టు విజయ్, ఇప్పకాయల కిశోర్, శంకర్, విజయకృష్ణ, వినోద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇందూరు నుంచే రాష్ట్రవ్యాప్తంగా విస్తరిస్తాం



శాసనసభ, లోక్‌సభ ఎన్నికలతో పాటు తాజాగా ఎమ్మెల్సీ పట్టభద్రుల, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ బీజేపీ సత్తా తెలిసింది. రోజురోజుకూ పార్టీ ప్రాబల్యం పెరిగింది. జిల్లాలో అతిపెద్ద పార్టీగా ఉంది. ఇదే ఉత్సాహంతో, ప్రజాదరణతో జెడ్పీ పీఠం, అత్యధిక ఎంపీపీ స్థానాలు, పంచాయతీల్లో గెలుస్తాం. మున్సిపల్ ఎన్నికల్లో స్వీప్ చేస్తాం. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్‌కు ఇక్కడి నుంచే చరమగీతం పాడి వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలోనూ అధికారం దక్కించుకుంటాం. ఇక బీఆర్ఎస్‌కు సైతం ఇక్కడినుంచే చరమగీతం పాడాం. తాజా విజయం బీజేపీ కార్యకర్తలందరిది. కార్యకర్తలు, నాయకులందరికీ అభినందనలు, ధన్యవాదాలు. – ధర్మపురి అర్వింద్, ఎంపీ

పట్టభద్రుల సీటూ కమలానిదే

- అధిక ఓట్లతో గెలిచిన బీజేపీ అభ్యర్థి అంజిరెడ్డి
- మూడురోజులు సాగిన ఎమ్మెల్సీ కౌంటింగ్
- ముగ్గురికే 92.52 శాతం ఓట్లు



బండి సంజయ్, అంజిరెడ్డి విజయోత్సాహం

సాక్షిప్రతినిధి, కరీంనగర్/సాక్షి,పెద్దపల్లి: నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్, మెదక్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి చిన్నమైల్ అంజిరెడ్డి విజయం సాధించారు. మూడు రోజుల పాటు ఉత్కంఠగా సాగిన ఓట్ల లెక్కింపులో ఎలిమినేషన్ రౌండ్స్‌తో బీజేపీ అభ్యర్థి గెలుపు ఖరారైంది. రెండో ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు తర్వాత కూడా గెలుపునకు సరిపడా కోటా ఓట్లు రాకపోయినా బీజేపీ అభ్యర్థి అంజిరెడ్డికి అత్యధిక ఓట్లు రావడంతో అతడినే విజేతగా ప్రకటించారు. చివరి వరకు హోరాహోరీగా పోరాడిన కాంగ్రెస్ అభ్యర్థి స్వల్ప ఓట్లతేడాతో ఓటమి పాలయ్యారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో కమలం పార్టీ విజయం సాధించటంతో పార్టీ శ్రేణులు సంబరాల్లో మునిగిపోయారు.

సుదీర్ఘంగా సాగిన కౌంటింగ్

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నిక ఫిబ్రవరి 27న జరగ్గా, మార్చి 3న కౌంటింగ్ ప్రారంభించారు. మూడు రోజుల పాటు నిర్విరామంగా మూడు షిఫ్టుల్లో 800 మంది కౌంటింగ్ సిబ్బంది కరీంనగర్‌లోని అంబేడ్కర్ స్టేడియంలో 21 టేబుళ్లపై లెక్కింపు ప్రక్రియను చేపట్టారు. సోమవారం ఉదయం 8 గంటలకు కౌంటింగ్ ప్రారంభించిన అధికారులు, మంగళవారం మధ్యాహ్నం వరకు చెల్లని ఓట్లను వడపోసి, కట్టలు కట్టారు. అదేరోజు రాత్రి నుంచి మొదటి ప్రాధాన్యత ఓట్లను కౌంటింగ్ ప్రారంభించి బుధవారం ఉదయం 8.30 గంటల నుంచి ఎలిమినేషన్ రౌండ్స్‌ను ప్రారంభించారు. ఎలిమినేషన్ రౌండ్స్‌లో బరిలో ఉన్న 54 మందిలో తక్కువ ఓట్లు వచ్చిన వారిని ఒక్కొక్కరిగా తొలగిస్తూ, వారి బ్యాలెట్ పేపర్‌లోని ద్వితీయ ప్రాధాన్యత ఓట్లను మిగిలిన అభ్యర్థులకు పంచుతూ కౌంటింగ్ ప్రక్రియను మూడు రోజులపాటు సుదీర్ఘంగా కొనసాగించారు.

త్రిముఖ పోటీలో..

ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో 56 మంది అభ్యర్థులు నిలిచారు. ప్రధానంగా కాంగ్రెస్, బీజేపీ, బీఎస్పీ అభ్యర్థుల మధ్య త్రిముఖ పోటీ నెలకొంది. చెల్లుబాటు అయిన ఓట్లల్లో 92.52 శాతం (2,06,659) మొదటి ప్రాధాన్యత ఓట్లు ఈ ముగ్గురికే వచ్చాయి. మిగిలిన 53 మంది ఇండిపెండెంట్ అభ్యర్థులు కేవలం 16,684 ఓట్లు మాత్రమే సాధించారు.

రెండో ప్రాధాన్యత ఓట్లలోనూ బీజేపీదే హవా

నిర్ధారిత కోటా ఓట్ల కోసం అభ్యర్థుల ఎలిమినేషన్ ప్రక్రియను చేపట్టగా అందులో సైతం బీజేపీ అభ్యర్థి ఆధిక్యం చూపారు. తొలుత 53 మందిని ఎలిమినేషన్ చేసి రెండో ప్రాధాన్యత ఓట్లు లెక్కించగా బీజేపీ అభ్యర్థికి 78,635 ఓట్లు, కాంగ్రెస్ అభ్యర్థికి 73,644 ఓట్లు, బీఎస్పీ అభ్యర్థికి 63,404 ఓట్లు వచ్చాయి. 53 మందిని ఎలిమినేషన్ చేసినా.. కోటా ఓట్లను ఎవరు సాధించకపోవడంతో మూడోస్థానంలోని బీఎస్పీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణను ఎలిమినేట్ చేశారు. అతనికి వచ్చిన ఓట్లలో రెండో ప్రాధాన్యత ఓట్లను లెక్కించారు. దీంతో బీజేపీ, కాంగ్రెస్ అభ్యర్థుల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. చివరకు బీఎస్పీ అభ్యర్థికి పోలైన ఓట్లలో చాలామంది రెండో ప్రాధాన్యత ఓటును బీజేపీకే వేయడంతో కమలం పార్టీకే విజయం దక్కింది.



కౌంటింగ్ హాల్‌లో ఓట్ల వివరాలు నమోదు చేసుకుంటున్న అంజిరెడ్డి, నరేందర్‌రెడ్డి తదితరులు

తెయూలో 21 నుంచి ఇంటర్నేషనల్ సెమినార్

- పాల్గొననున్న హార్వర్డ్ యూనివర్సిటీ ప్రొఫెసర్లు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీలో ఈనెల 21 నుంచి 25 వరకు ఇంటర్నేషనల్ సెమినార్ నిర్వహించనున్నట్లు కన్వీనర్ మామిడాల ప్రవీణ్ తెలిపారు. వైస్ చాన్స్‌లర్ టీ యాదగిరిరావు, రిజిస్ట్రార్ ఎం యాదగిరి బుధవారం సెమినార్‌కు సంబంధించిన బ్రోచర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్సీ, కెపాసిటీ బిల్డింగ్ ప్రోగ్రాం, సెల్ఫ్ కేర్ అనే అంశాలపై ఐదు రోజులపాటు అంతర్జాతీయ సదస్సు నిర్వహిస్తామన్నారు. యునైటెడ్ వే హైదరాబాద్ సౌజన్యంతో నిర్వహించనున్న సదస్సులో 'రిమైనింగ్ హయ్యర్ ఎడ్యుకేషన్ ఇన్ ఇండియా' అనే అంశంపై హార్వర్డ్ యూనివర్సిటీ ప్రొఫెసర్లు ప్రసంగిస్తారని తెలిపారు. హార్వర్డ్ యూనివర్సిటీ ప్రొఫెసర్లు డాక్టర్ పావని, డాక్టర్ కాండీసీ, డాక్టర్ షో కి, డాక్టర్ గాబ్రియల్, డాక్టర్ బెన్, డాక్టర్ డోరిస్, శ్రేయ అలెగ్జాండర్లు రిసోర్స్ పర్సన్ గా పాల్గొంటారని కన్వీనర్ ప్రవీణ్ తెలిపారు. వైస్ ప్రిన్సిపాల్ ఎం సత్యనారాయణ రెడ్డి, పీఆర్‌వో డైరెక్టర్ ఏ పున్నయ్య, నాగరాజు, సంపత్, జమీల్ అహ్మద్, దత్తహరి తదితరులు పాల్గొన్నారు.



బ్రోచర్లను ఆవిష్కరిస్తున్న వీసీ యాదగిరిరావు, రిజిస్ట్రార్ యాదగిరి

నీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించాలి

- సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలి
- తాగునీటి పథకాలకు నిరంతర విద్యుత్ అందించండి
- గ్రామాల వారీగా పరిస్థితిని సమీక్షించాలి
- వీడియోకాన్ఫరెన్స్‌లో కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు



వీడియోకాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, అదనపు కలెక్టర్ అంకిత్

నిజామాబాద్ అర్బన్: వేసవిలో తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు అధికారులను ఆదేశించారు. తాగునీటి సరఫరా, ఆస్తి పన్ను, ప్లాట్ల క్రమబద్ధీకరణ (ఎల్ఆర్ఎస్), ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు మార్క్‌ఔట్, రెసిడెన్షియల్ పాఠశాలలు, హాస్టళ్లలో కంప్లయింట్ బాక్సుల ఏర్పాటు తదితర అంశాలపై అదనపు కలెక్టర్ అంకిత్‌తో కలిసి సంబంధిత అధికారులతో కలెక్టర్ బుధవారం వీడియోకాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. గ్రామాల వారీగా నీటి సరఫరా పరిస్థితిని నిరంతరం సమీక్షించాలని, అవసరమైన చోట్ల చేతిపంపులు, బోరు బావులకు మరమ్మతులు చేయించాలన్నారు. రెండు రోజుల్లో మరమ్మతులు పూర్తి చేయించాలని ఆదేశించారు. మంచినీటి పథకాలకు నిరంతర విద్యుత్ సరఫరా చేయాలన్నారు. పరీక్షల సీజన్‌లో హాస్టళ్ల, రెసిడెన్షియల్ స్కూళ్లకు నీటి సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు.

ఇందిరమ్మ ఇళ్లపై..

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి లబ్ధిదారులు నిర్మాణాలు చేపట్టేలా మార్క్‌ఔట్ త్వరితగతిన చేసి ఆన్‌లైన్‌లో వివరాలను పొందుపర్చాలని కలెక్టర్ అన్నారు.

ఫిర్యాదుల పెట్టెలు..

ప్రభుత్వ రెసిడెన్షియల్ పాఠశాలలు, కళాశాలలు, సంక్షేమ వసతి గృహాల్లో ఫిర్యాదు పెట్టెలను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. వీటి ద్వారా అందే ఫిర్యాదులను ప్రతి వారం పరిశీలిస్తూ, సమస్యలను పరిష్కరించాలని అధికారులకు సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జెడ్పీ సీఈవో సాయాగౌడ్, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్‌కుమార్, డీపీవో శ్రీనివాస్, విద్యుత్‌శాఖ ఎస్ఈ రవీందర్, జిల్లా వ్యవసాయాధికారి వాజిద్ హుస్సేన్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ రాజేంద్ర కుమార్, ఈఈలు రాకేశ్, స్వప్న, మున్సిపల్ కమిషనర్లు, మండల స్పెషల్ ఆఫీసర్లు, ఎంపీడీవోలు, ఎంపీవోలు, మిషన్ భగీరథ ఏఈలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పన్ను వసూళ్లపై..

ఆస్తి పన్ను, ప్లాట్ల క్రమబద్ధీకరణ రుసుము వసూళ్లలో వేగం పెంచాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. నిర్ణీత గడువు లోగా పాత బకాయిలతోపాటు వందశాతం పన్ను వసూలు చేయాలన్నారు. పన్ను వసూళ్లలో వెనుకబడిన గ్రామ పంచాయతీ కార్యదర్శులపై చర్యలు తీసుకోవాలని డీఎల్‌పీవోలను ఆదేశించారు. ఎల్ఆర్ఎస్ క్రమబద్ధీకరణ ఫీజు ఈనెలాఖరు లోగా చెల్లిస్తే 25 శాతం రిబేటు వర్తిస్తుందన్నారు.

క్లుప్తంగా

యోగాతో మానసిక ప్రశాంతత



యోగాసనాలు వేయిస్తున్న ఆరోగ్య రక్ష నేచర్‌క్యూర్ సెంటర్ థెరపిస్ట్ ఐశ్వర్య

తెయూ(డిచ్‌పల్లి): క్రమం తప్పకుండా యోగా చేయడంతో ఒత్తిడిని జయించి మానసిక ప్రశాంతత పొందవచ్చని తెలంగాణ యూనివర్సిటీ ఉమెన్స్ సెల్ డైరెక్టర్ భ్రమరాంభిక తెలిపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని తెయూ వీసీ ప్రొఫెసర్ టి.యాదగిరిరావు ఆదేశాల మేరకు ఉమెన్స్ సెల్ ఆధ్వర్యంలో బుధవారం యోగాపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆరోగ్యరక్ష నేచర్‌క్యూర్ యోగా సెంటర్ థెరపిస్ట్ ఐశ్వర్య వర్సిటీలోని విద్యార్థినులు, అధ్యాపకులతో యోగాసనాలు వేయించారు. సంపూర్ణ ఆరోగ్యం కోసం ప్రతి ఒక్కరూ క్రమం తప్పకుండా యోగా చేయాలని సూచించారు.

స్త్రీనిధి వసూళ్లకు స్పెషల్ డ్రైవ్

- మహిళా దినోత్సవంలోపు వసూలు చేయాలని ఆదేశం
- ప్రత్యేక బృందాలు ఏర్పాటు
- ఎన్‌పీఏ ఉండొద్దని అధికారుల యోచన



మోర్తాడ్(బాల్కొండ): స్త్రీ నిధి రుణాల బకాయిల వసూళ్ల కోసం అధికార యంత్రాంగం ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపింది. ఇతర జిల్లాలతో పోల్చితే బకాయిలు అంతగా లేకపోయినా ఎన్‌పీఏ (నాన్ ఫెర్ఫార్మింగ్ అస్సెట్స్)లోకి చేరిన ఖాతాల సంఖ్య పెరిగిపోయింది. ఎన్‌పీఏలోకి రుణ ఖాతాలు చేరితే మొండి బకాయిల శాతం పెరిగిపోతుందనే ఉద్దేశంతో వసూళ్లపై దృష్టిసారించారు. ఈ నెల 8న నిర్వహించనున్న అంతర్జాతీయ మహిళా దినోత్సవం వరకు ఎంత వీలైతే అంత ఎన్‌పీఏ తగ్గించాలని అధికారులు భావిస్తున్నారు. బ్యాంకు లింకేజీ రుణాల వసూళ్లకు బ్యాంకర్లు బాధ్యత వహిస్తుండగా, స్త్రీ నిధి రుణాల విషయంలో మాత్రం గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ఉద్యోగులపైనే భారం పడింది. జిల్లా వ్యాప్తంగా ఎన్‌పీఏ ఖాతాల సంఖ్య పెరగడంతో ఐకేపీ ఉద్యోగులు, మహిళా సమాఖ్యల ప్రతినిధులు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నారు. కాగా, నవీపే ట్ మండలంలో రూ.1,34,61419 బకాయిలు ఉండగా, రూ.1,09,48,326 బకాయిలతో బోధన్ రెండో స్థానంలో నిలిచింది. రూ.13,05,823 బకాయిలతో చందూర్ మండలం చివరిస్థానంలో ఉంది.

రుణాల పంపిణీ ఇలా...

జిల్లాలో స్త్రీ నిధి ద్వారా 89,203 మందికి రూ.577,01,14,043 రుణాలు పంపిణీ చేశారు. ఇప్పటి వరకు రూ.140,18,59,407 వసూలు కావాల్సి ఉండగా, రూ.125,43,99,055 వసూలయ్యాయి. మిగతా వాటిని కూడా వసూలు చేసి, రుణాల చెల్లింపులను గాడిలో పెట్టాలని అధికారులు యోచిస్తున్నారు.

బకాయిలు ఉండొద్దు

స్త్రీ నిధి రుణాల వసూళ్లను లక్ష్యానికి అనుగుణంగా సాగించాలి. బకాయిలు ఎప్పటికప్పుడు వసూలు చేయడంతో ఎన్‌పీఏ ఉండదు. కొత్తవారికి స్త్రీ నిధి రుణాలు మంజూరు చేసేందుకు అవకాశం ఉంటుంది. అందుకే ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి వసూళ్ల ప్రక్రియను వేగవంతం చేశాం.

– సాయాగౌడ్, డీఆర్డీవో

నోటి శుభ్రత.. ఆరోగ్యానికి రక్షణ

- నిత్యం రెండ్లు సార్లు బ్రష్ చేయాలి
- దంతవైద్య నిపుణుల సూచన
- నేడు జాతీయ దంతవైద్యుల దినోత్సవం



నిజామాబాద్ నాగారం: మానవ శరీరంలో ఉన్న అవయవాలు సమర్థవంతంగా పనిచేసేందుకు శక్తినిచ్చేది దంతాలు. ఆహారాన్ని నమిలి మింగడానికి దోహదపడతాయి. అందుకే నోరు బాగుంటేనే ఆరోగ్యం బాగుంటుందని దంత వైద్యులు చెబుతుంటారు. నోటి శుభ్రతపై నిర్లక్ష్యం వహించొద్దని సూచిస్తున్నారు. నేడు జాతీయ దంత వైద్యుల దినోత్సవం సందర్భంగా 'సాక్షి' ప్రత్యేక కథనం..

ఉదయం, సాయంత్రం సరిగా బ్రష్ చేసుకోకపోవడంతో నోట్లో ఆహారం చేరి బ్యాక్టీరియా తయారవుతుంది. దీంతో పుప్పిపళ్ల సమస్య ఉత్పన్నమవుతుంది. ఇదే కాకుండా నోరు శుభ్రంగా లేకపోతే రోగాలు దరి చేరుతాయని వైద్యులు చెబుతున్నారు.

దంతాల శుభ్రతలో జాగ్రత్తలు..

- దంతాలను ఆరోగ్యంగా ఉంచేందుకు రోజుకు రెండుసార్లు బ్రష్ చేయాలి.
- ఏదైనా తిన్న తర్వాత నోటిని నీటితో కడగాలి. దీంతో పంటిలో చిక్కుకున్న ఆహారం బయటకు పోతుంది.
- ప్రతి ఆరు నెలలకోసారి దంత పరీక్షలు చేయించుకోవడం ఉత్తమం.
- మన్నికైన టూత్ పేస్ట్, టూత్ బ్రష్‌లను వాడాలి.
- చాక్లెట్లు, చిప్స్, తీపి పదార్థాలు తినొద్దు.


పాలపదార్థాలు తీసుకోవాలి



దంతాలను పటిష్టం చేసేందుకు చేపలు చాలా బాగా పని చేస్తాయి. ప్రజలు తీసుకునే ఆహారంలో పాలు, పెరుగు, జున్ను చేర్చాలి. వీటిలో క్యాల్షియం, విటమిన్ 'సి' ఉంటాయి. దీంతో దంతాలు ఆరోగ్యంగా ఉంటాయి.

– డాక్టర్ ఎస్. భాస్కర్, దంత వైద్యుడు

నిర్లక్ష్యం చేయొద్దు



దంత సమస్య వచ్చినప్పుడు నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలి. నోటి పరిశుభ్రత ఎంతో ముఖ్యం. ప్రతి ఆరు నెలలకోసారి వైద్యుల వద్ద దంత పరీక్షలు చేయించుకోవాలి.

– డాక్టర్ శ్రీనునాయక్, దంత వైద్యుడు

బయోటెక్నాలజీతో బహుముఖ ప్రయోజనాలు



మాట్లాడుతున్న తెయూ వీసీ ప్రొఫెసర్ యాదగిరిరావు

తెయూ(డిచ్‌పల్లి): బయోటెక్నాలజీ పరిశోధనలతో వివిధ రంగాల్లో బహుముఖ ప్రయోజనాలు కలుగుతాయని తెలంగాణ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ టి.యాదగిరిరావు తెలిపారు. ప్రధానంగా వ్యవసాయ రంగంలో నూతన వంగడాల సృష్టి, పారిశ్రామిక రంగంలో అధిక ఉత్పత్తి, వైద్య రంగంలో వ్యాధుల నివారణకు ఈ శాస్త్రం కృషి చేస్తోందన్నారు. తెయూ బయోటెక్నాలజీ విభాగం ఆధ్వర్యంలో బుధవారం బయోటెక్నాలజికల్ ప్రయోగాల ప్రదర్శనపై నిర్వహించిన ఒకరోజు వర్క్‌షాప్‌లో వీసీ ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. బయోటెక్నాలజీ.. నూతనంగా ఆవిష్కరించిన ఆధునిక శాస్త్రమన్నారు. కొవిడ్ మహమ్మారిలాంటి ప్రాణాంతక వైరస్‌ను అరికట్టేందుకు భారత్ బయోటెక్నాలజీ సంస్థ వ్యాక్సిన్ తయారుచేసి ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రజల ప్రాణాలను కాపాడిందని గుర్తుచేశారు. అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థ వృద్ధికి బయోటెక్నాలజీ పరిశోధనలు కీలకమని వివరించారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎం.యాదగిరి మాట్లాడుతూ.. శాస్త్ర సాంకేతిక రంగాల అభివృద్ధితో మనదేశం వికసిత భారత్ లక్ష్యంగా ముందుకు పోతుందన్నారు. విద్యార్థులు తమ లక్ష్యాలను ఏర్పాటు చేసుకునేందుకు ఇలాంటి వర్క్‌షాప్‌లు దోహదం చేస్తాయని తెలిపారు. కార్యక్రమంలో సదస్సు కన్వీనర్, బయోటెక్నాలజీ విభాగాధిపతి డాక్టర్ ప్రసన్న శీల, వైస్ ప్రిన్సిపల్ ఎం.సత్యనారాయణరెడ్డి, కోకన్వీనర్ కిరణ్మయి, అధ్యాపకులు మహేందర్, జవేరియా, నాగరాజు తదితరులు పాల్గొన్నారు. వర్క్‌షాప్‌నకు సుమారు 350మందికి పైగా విద్యార్థులు హాజరై జీవ సాంకేతిక శాస్త్ర ప్రయోగ పద్ధతులను తెలుసుకున్నారు.

అధికార పార్టీ ఎమ్మెల్యేలు రాజీనామా చేయాలి



మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేపీ నాయకులు

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేశ్ పటేల్ కులాచారి
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం

సుభాష్‌నగర్: జిల్లా అభివృద్ధికి అడ్డుపడుతున్న అధికార కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు సుదర్శన్‌రెడ్డి, డాక్టర్ భూపతిరెడ్డి వెంటనే రాజీనామా చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేశ్ పటేల్ కులాచారి డిమాండ్ చేశారు. జవహర్ నవోదయ విద్యాలయాన్ని అడ్డుకోవడాన్ని నిరసిస్తూ బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి దిష్టిబొమ్మను బుధవారం నగరంలోని నిఖిల్‌సాయి చౌరస్తాలో దహనం చేశారు. ఈ సందర్భంగా దినేశ్ పటేల్ కులాచారి మాట్లాడుతూ ఎంపీ అర్వింద్ ఆర్మూర్, బాల్కొండ, నిజామామాబాద్ రూరల్ నియోజకవర్గాలకు విద్యాపరంగా ప్రయోజనం కలిగేలా జవహర్ నవోదయ విద్యాలయానికి జక్రాన్‌పల్లి మండలం కలిగోట్ శివారులో భూమి కేటాయించాలని కలెక్టర్‌ను కోరారని తెలిపారు. కానీ, మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి కలిగోట్‌లో కాకుండా బోధన్‌లో ఏర్పాటు చేయాలనే ఉద్దేశంతో షుగర్ ఫ్యాక్టరీకి చెందిన 8 ఎకరాల భూమిని ప్రతిపాదించారని పేర్కొన్నారు. ఫ్యాక్టరీకి చెందిన స్థలంలో నవోదయ ఏర్పాటును రిజెక్ట్ చేసిందని గుర్తుచేశారు. రూరల్ నియోజకవర్గానికి మంజూరైన జవహర్ నవోదయ విద్యాలయాన్ని బోధన్‌కు తరలించుకుపోతుంటే స్థానిక ఎమ్మెల్యే భూపతిరెడ్డి ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. కార్యక్రమంలో నాయకులు న్యాలం రాజు, లక్ష్మీనారాయణ, నాగోళ్ల లక్ష్మీనారాయణ, గంగోనే గంగాధర్, హరీశ్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, మెట్టు విజయ్, ఆమంద్ విజయ్ కృష్ణ, ఆకుల శ్రీనివాస్, తారక్ వేణు, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

గల్ఫ్ ఏజెంట్ మోసం

- షార్జాలో ఇబ్బందిపడుతున్న యువకుడు
- కొడుకును స్వగ్రామానికి రప్పించాలని తల్లి వినతి

బోధన్‌రూరల్: గల్ఫ్ ఏజెంట్ మోసం చేయడంతో బోధన్ మండలం పెగడాపల్లికి చెందిన ఓ యువకుడు షార్జాలో ఉపాధి లేక ఇబ్బందులు పడుతున్న విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గ్రామస్తులు తెలిపిన ప్రకారం ఇలా ఉన్నాయి. పెగడపల్లి గ్రామానికి చెందిన గుండారం ప్రభాకర్, భాగ్య దంపతులకు ఇద్దరు కొడుకులు. గ్రామంలో చాకలి వృత్తి చేసుకుంటూ జీవనం సాగిస్తుంటారు. వీరి పెద్ద కొడుకు గుండారం చంద్రశేఖర్‌కు దుబాయి లేదా షార్జాలో క్లీనింగ్ పని ఇప్పిస్తానని నిజామాబాద్‌కు చెందిన కృష్ణ అనే ఏజెంట్ ఎనిమిది నెలల క్రితం సుమారు రూ.90 వేల వరకు తీసుకున్నాడు. తీరా దుబాయికి వెళ్లగా అక్కడ ఏజెంట్ చెప్పినట్లుగా ఉపాధి లభించలేదు. చంద్రశేఖర్‌ను అక్కడి నుంచి షార్జాకు తీసుకెళ్లారు. అక్కడ కూడా సరైన ఉపాధి చూపించలేదు. దీంతో ఉపాధి లేక ఇబ్బందులు పడుతున్న చంద్రశేఖర్ రోజువారీ ఖర్చుల కోసం కుటుంబ సభ్యులే పలుమార్లు డబ్బులు పంపించారు. ఈ విషయమై ఏజెంట్‌కు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని, ప్రస్తుతం తమ కొడుకు ఇబ్బందులు పడుతున్నాడని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తంచేశారు. మోసం చేసిన ఏజెంట్ కృష్ణపై చర్యలు తీసుకుని తమ కొడుకును స్వగ్రామాని రప్పించాలని బోధన్ రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేసింది.

ఘటనపై ఎస్సై మచ్చేందర్ రెడ్డిను సంప్రదించగా బాధిత కుటుంబీకులు సమస్యను తమ దృష్టికు తెచ్చారని, విచారణ అనంతరం చర్యలు తీసుకుంటామని తెలిపారు.

మత్తు పదార్థాలపై ఉక్కుపాదం మోపాలి

- అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్, పాల్గొన్న ఎక్సైజ్ అధికారులు

నిజామాబాద్ అర్బన్: సమాజానికి పెను సవాలుగా మారిన మాదకద్రవ్యాలు, మత్తు పదార్థాల నిరోధానికి సంబంధిత శాఖల అధికారులు కలిసికట్టుగా కృషి చేయాలని అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ తెలిపారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో అదనపు కలెక్టర్ నేతృత్వంలో బుధవారం జిల్లాస్థాయి మాదకద్రవ్యాల నిరోధక కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాలపై ఉక్కుపాదం మోపేందుకు అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. గంజాయి వంటి మత్తు పదార్థాల మూలాలను అడ్డుకుంటే చాలా వరకు నియంత్రించవచ్చని తెలిపారు. కల్తీ కల్లు తయారీకి వినియోగించే అల్ప్రాజోలం నిల్వలపై ఆరా తీసి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. అదనపు డీసీపీ బస్వారెడ్డి, ఎక్సైజ్ సూపరింటెండెంట్ మల్లారెడ్డి, డీఎంహెచ్‌వో డాక్టర్ రాజశ్రీ, వ్యవసాయ శాఖ అధికారి వాజిద్ హుస్సేన్, జిల్లా రవాణా శాఖ అధికారి ఉమామహేశ్వర్ రావు, అటవీ, వాణిజ్య పన్నులు, ఔషధ నియంత్రణ తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

వేర్వేరు ఘటనల్లో ఐదుగురి మృతి

ఉమ్మడి జిల్లాలో బుధవారం జరిగిన వివిధ ఘటనల్లో ఐదుగురు మృతి చెందారు. కామారెడ్డి జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ, నిజామాబాద్ జిల్లాలో వేర్వేరు చోట్ల వాహనాలు ఢీకొని ఇద్దరు వ్యక్తులు అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యారు. ఫిట్స్‌తో యువకుడు, బురదగుంటలో పడి మరో వ్యక్తి మరణించారు.

పింఛన్ కోసం వెళ్లి వస్తుండగా..



అంజవ్వ(ఫైల్)

కామారెడ్డి రూరల్: పింఛన్ కోసం వెళ్లి తిరిగి ఇంటికి వస్తున్న ఓ మహిళ కారు ఢీకొని మృతి చెందిన ఘటన కామారెడ్డి మండలం చిన్నమల్లారెడ్డి గ్రామంలో బుధవారం సాయంత్రం చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన భూమన్నగారి అంజవ్వ(55) తనకు వచ్చే వితంతు పింఛన్ కోసం పక్కనే ఉన్న సరంపల్లి గ్రామానికి వెళ్లింది. పింఛన్ తీసుకొని సాయంత్రం 4.30 గంటల ప్రాంతంలో నడుచుకుంటూ తిరిగి చిన్నమల్లారెడ్డికి వస్తుండగా గ్రామ శివారులో వెనుక నుంచి వస్తున్న కారు ఢీకొట్టింది. దీంతో అంజవ్వ తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే మరణించింది. మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు దేవునిపల్లి పోలీసులు తెలిపారు.

ఫిట్స్‌తో యువకుడు..



రాకేశ్(ఫైల్)

ఇందల్వాయి: పశుగ్రాసం కోసం వెళ్లిన యువకుడు ఫిట్స్ వచ్చి పొలంలోనే పడి మృతి చెందిన ఘటన సిర్నాపల్లిలో బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన కొబ్బాజి రాకేశ్(23) ఉదయం తన స్నేహితులతో కలిసి పొలానికి వెళ్లాడు. గడ్డికోసే క్రమంలో ఫిట్స్ రావడంతో పొలంలో పడి ఊపిరాడక మృతి చెందాడు. ఆలస్యంగా గమనించిన స్నేహితులు కుటుంబీకులకు సమాచారం అందించారు. గతంలో పెద్ద కొడుకు రోడ్డు ప్రమాదంలో మరణించగా, ప్రస్తుతం రెండో కొడుకు రాకేశ్ ఫిట్స్‌తో మృతి చెందడంతో తల్లిదండ్రులు కొబ్బాజి గంగారం కళావతి శోకసంద్రంలో మునిగారు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై మనోజ్ తెలిపారు.

హార్వెస్టర్ ఢీకొని వ్యక్తి ..

డొంకేశ్వర్(ఆర్మూర్): డొంకేశ్వర్ మండలం అన్నారం శివారులో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. జీజీ నడ్కుడకు చెందిన బాద్మణ చిన్నారెడ్డి (45) ద్విచక్ర వాహనంపై డొంకేశ్వర్ నుంచి సొంతూరికి వెళ్తుండగా అన్నారం శివారులో ఎదురుగా వస్తున్న హార్వెస్టర్ ఢీకొట్టింది. హార్వెస్టర్ కిందకు వెళ్లడంతో చిన్నారెడ్డి తలకు తీవ్రగాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఒక కొడుకు, కూతురు ఉన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని..



శ్రీనివాస్(ఫైల్)

ఎడపల్లి(బోధన్): ఎడపల్లి మండలంలోని ఠాణాకలాన్ – జానకంపేట్ రోడ్డులో బుధవారం గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి చెందాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఠాణాకలాన్ గ్రామానికి చెందిన మెట్టు శ్రీనివాస్ (33) జానకంపేట్ నుంచి ఠాణాకలాన్ వైపు బైక్‌పై వెళుతుండగా ఎదురుగా వచ్చిన గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో శ్రీనివాస్ అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికుల ద్వారా సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బోధన్ జిల్లా ఆస్పత్రికి తరలించారు. కాగా, ఓ మొరం టిప్పర్ శ్రీనివాస్‌ను ఢీకొట్టినట్లు పలువురు అనుమానిస్తున్నారు. మృతుడు జక్రాన్‌పల్లి మండలంలోని తొర్లికొండ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు.

చేపల కోసం వెళ్లి వ్యక్తి ..

రుద్రూర్: మండలంలోని బొప్పాపూర్ గ్రామానికి చెందిన బొర్ర చిన్న సాయిలు (45) చేపల కోసం వెళ్లి ప్రమాదవశాత్తు మృతి చెందినట్లు ఎస్సై సాయన్న తెలిపారు. మంగళవారం రాత్రి గ్రామ శివారులోని గూండ్ల వాగు వద్దకు వెళ్లిన సాయిలు.. చేపల కోసం వల వేసి తిరిగి వస్తుండగా ప్రమాదవశాత్తు కాలుజారి బురదగుంటలో పడిపోయాడు. రాత్రంతా ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు వెతుకుతుండగా బురదగుంటలో సాయిలు మృతదేహం కనిపించింది. బుధవారం ఉదయం భార్య గోదావరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు.

మహిళ మృతదేహం లభ్యం

మాక్లూర్: మండలంలోని చిక్లి గ్రామానికి చెందిన సాదుల్ల సుశీల (55) మృతదేహం బుధవారం ధర్మోరా గ్రామం వద్ద గుత్ప ఎత్తిపోతల కాలువలో లభ్యమైంది. మాక్లూర్ ఎస్సై రాజశేఖర్ కథనం ప్రకారం.. సాదుల్ల సుశీల కొన్ని సంవత్సరాలుగా అనారోగ్యంతో బాధపడుతోంది. ఆమె భర్త సాయన్న గత సంవత్సరం అనారోగ్యంతో మృతి చెందాడు. సుశీలకు అనారోగ్యం, ఆర్థిక ఇబ్బందులుండడంతో జీవితంపై విరక్తితో ఈ నెల 2న ఇంట్లో చెప్పకుండా వెళ్లి నందిపేట వద్ద కాలువలో దూకినట్లు తెలుస్తుందని పేర్కొన్నారు. ప్రవాహం ఎక్కువగా ఉండడంతో కాలువలో కొట్టుకువచ్చి ధర్మోరా వద్ద తేలిందన్నారు. మృతురాలి కుమారుడు సందీప్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రైలు కిందపడి యువకుడి ఆత్మహత్య

కామారెడ్డి క్రైం: ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ యువకుడు రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్న ఘటన కామారెడ్డిలో బుధవారం ఉదయం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.

కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని సరంపల్లి గ్రామానికి చెందిన గుర్రం నాగేశ్ (25) ఆటో నడిపిస్తూ జీవనం సాగించేవాడు. అప్పుల కారణంగా కొద్దిరోజులుగా కుటుంబంలో గొడవలు జరుగుతున్నాయి. బుధవారం ఉదయం ఇంట్లో గొడవ జరగడంతో మనస్తాపం చెందిన నాగేశ్ బయటకు వెళ్లి రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నట్లు పేర్కొన్నారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న ఎస్‌హెచ్‌వో సత్యనారాయణగౌడ్

ఆర్మూర్‌టౌన్: అర్ధరాత్రి తాళం వేసిన ఇళ్లలో చోరీకి పాల్పడుతున్న నిందితుడిని అరెస్టు చేసినట్లు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణగౌడ్ తెలిపారు. బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఆలూర్ మండలం దేగాం, మిర్దాపల్లి గ్రామాల్లోని పలు ఇళ్లలో ఇటీవల చోరీలు జరిగాయి. కేసు దర్యాప్తులో భాగంగా ఆర్మూర్ పాత బస్టాండ్ వద్ద మంగళవారం ఉదయం ప్రధాన నిందితుడైన అలకుంట శ్రీనివాస్‌ను అదుపులోకి తీసుకొని విచారించగా చోరీ చేసినట్లు ఒప్పుకున్నాడన్నారు. నిందితుని నుంచి బంగారు, వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. నిందితుడిని కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

కత్తితో దాడి చేసిన వ్యక్తి అరెస్టు

ఖలీల్‌వాడి: తాగిన మత్తులో కత్తితో దాడి చేసిన వ్యక్తిని అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై యాసిన్ ఆరాఫత్ బుధవారం తెలిపారు. ఎస్సై తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. నగరంలోని గాజులపేట్‌లో మంగళవారం బోడిగం సంతోష్ అనే వ్యక్తి తాగిన మత్తులో తన బంధువైన లింగంపల్లి మహేశ్‌పై దాడి చేశాడు. బాధితుడి భార్య లింగంపల్లి పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని తెలిపారు. నిందితుడిని మెజిస్ట్రేట్ ముందు హాజరుపర్చగా 15 రోజుల జ్యుడీషియల్ కస్టడికి పంపినట్లు ఎస్సై తెలిపారు.

కేసు విత్‌డ్రా చేసుకున్న మాజీ ఎమ్మెల్యే

ఖలీల్‌వాడి: ఎన్నికల ప్రచారంలో తన వాహన అద్దాలు పగులగొట్టిన ఇద్దరిపై నమోదైన కేసును కొట్టివేయాలంటూ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ బుధవారం జూనియర్ సివిల్ జడ్జి ఎదుట హాజరయ్యారు. వివరాలు ఇలా ఉన్నాయి. బాజిరెడ్డి గోవర్ధన్ 2014 ఏప్రిల్ 23న నిజామాబాద్ రూరల్ అభ్యర్థిగా ఎన్నికల ప్రచారంలో భాగంగా ఎలమ్మకుంటకు వెళ్లారు. ప్రచారం చేయకుండా కాంగ్రెస్ పార్టీకి చెందిన కేతావత్ మోహన్, కేతావత్ యాదగిరి తదితరులు అడ్డుకొని కారు అద్దాలు పగులగొట్టారని బాజిరెడ్డి గోవర్ధన్ రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు విత్‌డ్రా కోసం మోహన్, యాదగిరిలు మాజీ ఎమ్మెల్యేను అభ్యర్థించగా బుధవారం నిజామాబాద్ నాల్గో అదనపు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్(జూనియర్ సివిల్ జడ్జి) వడ్డి హరికుమార్ ఎదుట లోక్ అదాలత్‌కు హాజరయ్యారు.

ఈ నెల 8న నిర్వహించనున్న లోక్‌అదాలత్‌లో కేసును కొట్టివేయాలని కోరగా, ముద్దాయిలపై కేసును కొట్టివేస్తూ జడ్జి హరికుమార్ అవార్డును జారీ చేశారు. న్యాయవాదులు అల్గోట్ రవీందర్, ఆశ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై కూలిన మర్రిచెట్టు

- ఒకరికి గాయాలు

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని మెంగారం గ్రామశివారులో బుధవారం రోడ్డుపై మర్రిచెట్టు కూలడంతో ఒకరికి గాయాలైనట్లు స్థానికులు తెలిపారు. మెంగారం గ్రామానికి చెందిన అన్నం సాయిలు మధ్యాహ్నం ద్విచక్ర వాహనంపై వస్తుండగా ప్రమాదవశాత్తు భారీ మర్రిచెట్టు కొమ్మ విరిగి పడింది. దీంతో సాయిలుకు గాయాలుకాగా, వాహనం ధ్వంసమైంది. గమనించిన స్థానికులు క్షతగాత్రుడిని లింగంపేట ఆస్పత్రికి తరలించారు. మర్రి కొమ్మ రోడ్డుపై పడడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. విషయం తెలుసుకున్న ఆర్ అండ్‌బీ అధికారులు కొమ్మలను తొలగించి రాకపోకలను పునరుద్ధరించారు.